క్లుప్తంగా

నేడు సరస్వతీదేవి అలంకారం

రాయదుర్గం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు సరస్వతీదేవీగా దర్శనమిస్తారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారు, గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలోని అన్నపూర్ణాదేవికి సరస్వతీ దేవీ అలంకారం చేస్తారు. అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సామూహిక పారాయణం ఉంటుంది. శివసాయిక్షేత్రంలో నిత్య చండీహోమం జరగనుంది.

నేడు నూతన కార్యవర్గ సమావేశం

పటాన్‌చెరు టౌన్: ముదిరాజ్ మహాసభ నూతన కార్యవర్గ సమావేశంను పటాన్‌చెరులోని ముదిరాజ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ముదిరాజ్ మహాసభ గౌరవ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సపాన్‌దేవ్ ఆదేశాల మేరకు ఈ సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేయడంతో పాటు జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఉంటుందని గురువారం తెలిపారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న భరత్‌గౌడ్

రాయదుర్గం: ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన రాష్ట్ర కల్లుగీత విభాగం కార్యవర్గంలో గురువారం పలువురికి అవకాశం కల్పించారు. ఆ విభాగం రాష్ట్ర చైర్మన్ కె నాగరాజుగౌడ్ రాష్ట్ర కల్లుగీత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని నాగార్జున గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ భరత్‌గౌడ్‌కు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ విజయానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని, కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సమస్యలు దశలవారీగా పరిష్కరించేలా చూస్తామన్నారు.

అదిగో అల్లదిగో..

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవంలో భాగంగా గురువారం ప్రముఖ నేపథ్య గాయకుడు శ్రీ వేణు శ్రీరంగం అన్నమయ్య కీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. నారాయణతే నమో నమో, ఎవ్వడెరుగును నీ ఎత్తులు, నగవులు నిజమని, గోవిందా గోవిందాయని, పొడగంటిమయ్య, అదిగో అల్లదిగో అంటూ అలరించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పటాన్‌చెరు టౌన్: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ మహంకాళి ఆలయం, నందిగామలో ఏర్పాటు చేసిన దేవీ మండపాల వద్ద గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం మహంకాళి దేవాలయ గౌరవాధ్యక్షులు కార్పొరేటర్ సపాన్‌దేవ్ , కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం...

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం చందానగర్ పాపిరెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 2018లో పోలిస్తే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మరింత బలపడిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు గౌడ్, రాజలింగం, సిద్దు, మహేష్, సతీష్, భరత్ యాదవ్, చరణ్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 10 మందికి జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 10 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరీమాత



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో అన్నపూర్ణా దేవిగా రాజరాజేశ్వరిమాత



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో లలితాత్రిపురసుందరిదేవిగా..



నానక్‌రాంగూడలో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గచ్చిబౌలిలోని రాజరాజేశ్వరిసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రం, రాయదుర్గంలోని ఊరపోచమ్మ దేవాలయంలో, రాయదుర్గంలోని మండపం, నానక్‌రాంగూడలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. శివసాయిక్షేత్రంలో చండీపారాయణం, చండీహోమం నిర్వహిస్తున్నారు.

- గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరిమాతకు అన్నపూర్ణాదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.
- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవికి లలితాత్రిపురసుందరిదేవి అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- కొండాపూర్‌లోని రాజరాజేశ్వరినగర్, రాఘవేంద్రకాలనీ సీబ్లాక్‌లో జైశ్రీరామ్ త్రిశక్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ హమీద్‌పటేల్ ప్రారంభించారు.



రాయదుర్గంలోని మండపం వద్ద పలు రకాల ప్రసాదాలను అమ్మవారికి సమర్పించిన దృశ్యం

- రాయదుర్గంలోని మండపం వద్ద నాగార్జున గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో రకరకాల ప్రసాదాలను అమ్మవారికి సమర్పిం చారు. కార్యక్రమంలో మాదాపూర్ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.



కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరీనగర్, రాఘవేంద్రకాలనీ సీబ్లాక్‌లో.. కార్పొరేటర్ హమీద్‌పటేల్‌ను సన్మానించిన ఉత్సవ సమితి



రాయదుర్గంలో.. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్, భరత్‌కుమార్ తదితరులు

కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకుందాం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రఘునాథ్‌యాదవ్

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకునేందుకు శేరిలింగంపల్లిలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్‌యాదవ్ కోరారు. భారతీనగర్‌లోని ఓల్డ్ ఎంఐజీకాలనీ, కైలాసనగర్, లింగంపల్లి కాలనీలకు చెందిన పలువురు రాఘవేంద్రకాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గాంధీ ఎంఐజీ కాలనీని అసలు పట్టించుకోలేదని విమర్శించారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. డాక్టర్ కైసర్, మీహర్, ఫాతిమా, సుశీల్, సందీప్, గణేష్, చంటి, సమ్మద్, శివ సాంబా, ముజీబ్, డాక్టర్ ముక్తార్, స్వప్న, అనుదీప్, సాదిక్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఖాజాగూడలోని సాయిఐశ్వర్య లేఅవుట్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా, బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం సంధ్యారాజు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు.

ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమానిపై చీటింగ్ కేసు నమోదు

గచ్చిబౌలి: ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమాని వెలగపూడి రఘు తేజపై వేర్వేరుగా రెండు చీటింగ్, బెదిరింపుల కేసులు గచ్చిబౌలి పీఎస్‌లో నమోదయ్యాయి. సీఐ జేమ్స్ బాబు తెలిపిన వివరాలిలా.. గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ కో ఆపరేటివ్ సొసైటీలో తేజ జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా భారీ ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సంవత్సరం క్రితం అనుమతులు లేకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్‌ను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. వచ్చిన లాభంలో 5 శాతం ఇస్తానని చెప్పడంతో ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ నిర్మాణ సమయంలో 2021లో గచ్చిబౌలిలో నివాసం ఉండె ఠాకూర్ ప్రసాద్ రూ.75 లక్షలు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బు అడగగా రూ.10 లక్షలు తిరిగి ఇచ్చారు. కళ్యాణ్ చక్రవర్తి అనే వ్యక్తి రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చానని వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. రఘు తేజ, అతని తండ్రి వెలగపూడి శ్రీనివాస్‌పై ఐపీసీ 406,420,506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ జేమ్స్ బాబు తెలిపారు.

నగరంలో సన్‌బర్న్.. నవంబరులో..

సాక్షి, సిటీబ్యూరో: ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్‌కి ప్రపంచ ప్రసిద్ధి చెందిన సన్ బర్న్ మ్యూజిక్ ఫెస్టివల్ నగరంలో మళ్లీ సందడి చేయనుంది. ఈ విషయాన్ని సహ నిర్వాహక సంస్థ అబ్జల్యూట్ గ్లాస్‌వేర్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసారి 6 గురు గ్లోబల్ ఆర్టిస్టులు, ఇంటర్నేషనల్ డీజేలు పాల్గొనే ఈ ఈవెంట్ నవంబరులో నగరానికి రానుంది. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో 24 ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, చివరగా ఫైనల్ ఈవెంట్, ప్రపంచ సంగీతాభిమానుల్ని పెద్ద సంఖ్యలో ఆకర్షించే గోవాలో డిసెంబర్ 28 నుండి 31 వరకు జరుగుతుందన్నారు.

బతుకమ్మ సంబరాలు



రాయదుర్గం: బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో బతుకమ్మ సంబరాలను గురువారం నిర్వహించారు. సైబరాబాద్ విమెన్ అండ్ చైల్డ్ వింగ్ డీసీపీ నితికాపంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొని బతుకమ్మ ఆడిపాడారు. ఈ సందర్భంగా డీసీపీ నితికాపంత్ మాట్లాడుతూ బతుకమ్మ సంబరాల్లో పోలీసు కుటుంబసభ్యులందరినీ కలవడం వారి కుటుంబసభ్యులతో బతుకమ్మ ఆడటం ఆనందంగా ఉందన్నారు. సిబ్బందికి పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీఏఓ అడ్మిన్ గీత, షీటీమ్ ఇన్‌స్పెక్టర్ సునీత, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, మహిళా పోలీసు సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో ..

భాగ్యనగర్‌కాలనీ: బతుకమ్మ వేడుకల్లో భాగంగా గురువారం హైదర్‌నగర్ డివిజన్‌లో జేఎన్‌టీయూ కళాశాల మెట్రో సమీపంలోని వర్టెక్స్ ప్రైమ్ గేటెడ్ కమ్యూనిటీలో సాంప్రదాయ దుస్తులతో మహిళలు, చిన్నారులు పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటం ఆడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.





కరపత్రాల పంపిణీ.. అభివృద్ధిపై ప్రచారం



పాపిరెడ్డి కాలనీలో ప్రచారం చేస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : పేదలకు ఇళ్ళ పట్టాలు ఇచ్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్‌కే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం చందానగర్ పాపిరెడ్డి కాలనీలో గడపగడపకు బీజేపీ రవన్న ప్రజా యాత్ర 103వ రోజు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ బీజేపీ పార్టీ చేసిన అభివృద్ధిని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న నాయకులు గోపిచెరువు, ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే ఎమ్మెల్యే వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. పాదయాత్రలో కాలనీవాసులు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, నాయకులు అనిల్‌కుమార్ యాదవ్, రమేష్, నరసింహ, శ్రీశైలం, విజయలక్ష్మి, శ్రీను, విజయ్, నరసింగ్ యాదవ్, ఇమ్రాన్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐయూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తుడుం అనిల్‌కుమార్



మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) బలపరిచిన ఎంసీపీఐయూ ఎమ్మెల్యే అభ్యర్థిగా అఖిల భారత కార్మిక సంఘాల కేంద్ర రాష్ట్ర అధ్యక్షులు, ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ తుడుం అనిల్‌కుమార్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా నగరంలో జరిగిన సమావేశంలో బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్,ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయల అశోక్ ఓంకార్‌లు ప్రకటించినట్లు అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మామద్దతు మీకే..



హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ కాలనీలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మైనారిటీలు తమ పూర్తి మద్దతు గాంధీకి ఉంటుందని తెలిపారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. మూడోసారి గెలిచిన వెంటనే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్ పటేల్, కాదర్, కరీం, జహీద్, ఖలీం, మహేందర్, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మద్దతు...

హఫీజ్‌పేట్ : ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీకే తమ మద్దతు అంటూ గురువారం చందానగర్ ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో తీర్మానం చేశారు. మండల ఆర్యవైశ్యుల సంఘం మాజీ అధ్యక్షులు గంప సత్యం, ప్రధాన కార్యదర్శి పబ్బా మల్లేష్ గుప్తా, సంఘం సలహాదారులు గంప సత్యనారాయణ, కోశాధికారి ఉప్పల భాస్కర్, పల్లపు కుమార్, కందికొండ యాదగిరి, పల్లెల వీరేశం గుప్తా, మహాకాళ రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష

మియాపూర్ : కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సతీమణి ఆరెకపూడి శ్యామలాదేవి అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, సీడీఆర్ ఎస్టేట్, ఆదర్శనగర్, శాంతినగర్, అట్లాంటిక్ సిటీ అపార్ట్‌మెంట్‌లో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో చిన్న వర్షం పడితే దీప్తిశ్రీనగర్ ,చుట్టుపక్కల ప్రాంతాలు వరదనీటితో మునిగిపోయేవని, ఎమ్మెల్యే గాంధీ హయంలో వరదనీటి కాల్వల నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించారని తెలిపారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో అభావృద్ధి చేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యమన్నారు.

మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: వాహన తనిఖీలో అమీన్‌పూర్ పోలీసులు మద్యం పట్టుకున్నారు. ఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని నవ్య చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, సుల్తాన్‌పూర్‌కు చెందిన నాయకోటి కుమార్ కిరాణాషాప్‌లో విక్రయించేందుకు మందు తీసుకెళ్తుండగా అతని పట్టుకుని రూ.7,453 విలువచేసే మద్యంను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

గంజాయి, చరస్ విక్రేతలు అరెస్ట్

- 1.10 కిలోల గంజాయి, 78 గ్రాముల చరస్ స్వాధీనం
- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అధికారులు

హఫీజ్‌పేట్ : గంజాయి, చరస్ ప్యాకెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు...రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నీలేష్ ఇండోరియా (28), మనీష్ (20)లు గత రెండు సంవత్సరాల క్రితం నగరంలోని ఫతేనగర్‌కు బతుకుదెరువు కోసం వచ్చారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గత ఆరు నెలల నుంచి వివిధ రాష్ట్రాల నుంచి గంజాయి, చరస్‌లను తీసుకువచ్చి ఐటీ కంపెనీలకు చెందిన ఉద్యోగులకు విక్రయిస్తున్నారు. గురువారం నానక్‌రామ్‌గూడ విప్రో జంక్షన్ ప్రాంతాలలో వీరిద్దరు తిరుగుతుండగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటి కమిషనర్ డేవిడ్ రవికాంత్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు డీటీఎఫ్ బృందం వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద 20 గ్రాముల చరస్, 60 గ్రాముల గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. విచారణలో ఫతేనగర్‌లోని వారి ఇంట్లో గంజాయి, చరస్‌లు ఉన్నాయని తెలుపడంతో అక్కడకు వెళ్లి తనిఖీలు చేయగా మరో 58 గ్రాముల చరస్, 970 గ్రాముల గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. మొత్తం 1.10 కిలోల గంజాయి, 70 గ్రాముల చరస్ ప్యాకెట్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.8.5 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు గంజాయి విక్రేతల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా ఎవరైన అమ్మితే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.